
చంద్రఘంట అలంకరణలో దేవతామూర్తులు


శ్రీ శుభానంద


సరస్వతీదేవి

కాళేశ్వర దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనుబంధ ఆలయాల్లో కొలువైన శ్రీ శుభానంద, సరస్వతీ దేవీలు చంద్రఘంట అలంకరణలో మూడో రోజు భక్తులకు దర్శనమిచ్చారు.

–న్యూస్‌టుడే, కాళేశ్వరం

ప్రజలకు అందుబాటులో న్యాయసేవలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : పారా లీగల్ వాలంటీర్లు పరిమితులకు లోబడి న్యాయసేవలను ప్రజల మధ్యకు తీసుకెళ్లాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ప్రజలకు న్యాయ సేవలను అందించేందుకు ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు న్యాయం అందించడంలో వాలంటీర్ల పాత్ర ముఖ్యమైందన్నారు. జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పండగ ప్రత్యేకం.. సంప్రదాయాల మమేకం

దసరా, సద్దుల బతుకమ్మ పండగల పేర్లు చెబితే ఎక్కడలేని సంతోషం కలుగుతుంది... ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా.. సొంతూళ్లకు సంతోషంగా తరలివస్తారు.. బడులు, కళాశాలలకు సెలవు రావడంతో పిల్లలంతా అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వచ్చి హాయిగా ఆటలాడతారు.. ఎంగిలిపూల బతుకమ్మ మొదలుకొని దసరా వరకు పల్లెల్లో బోలెడంత సందడి కనిపిస్తుంది. మహిళలంతా గుళ్లల్లో, చెరువు కట్టల వద్ద బతుకమ్మ ఆటపాటలతో అలరిస్తారు. ఇక ఓరుగల్లు ప్రాంతంలో ఈ పండగను కొన్ని ఊళ్లల్లో మరింత ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.. ఆ విశేషాలతో 'ఈనాడు' కథనమిది..

–ఈనాడు, వరంగల్

అదిగదిగో మా ఊరు..
దసరా వచ్చిందంటే దాని తీరేవేరు..
అన్నాతమ్మీ అంటూ ఆత్మీయ పలకరింపులు
వదినా మరదళ్ల నవ్వుల తుళ్లింతలు..
గునుగు తంగేడు సోయగాలతో బతుకమ్మ ఆటలు..
ఉయ్యాలో.. రామ ఉయ్యాలో.. అంటూ ఆడపడుచుల పాటలు..
బంతి పూలు, మామిడాకులతో స్వాగతం పలికే గుమ్మాలు..
కమ్మని పిండివంటలతో ఇంటింటా ఘుమఘుమలు..
పట్టు పరికిణీల్లో సందడిచేసే పడుచు పిల్లలు..
జమ్మిచెట్టు వద్ద ఆత్మీయ ఆలింగనాలు..
అందుకే పట్నంవారంతా పల్లెబాట పడతారు..
ఎవరికివారు.. ఊళ్లల్లో
'ప్రత్యేకత'ను చాటుతున్నారు.

ఆదివారం ప్రత్యేకం

ఉప్పొంగే దేశభక్తి



దేశమంతా పంద్రాగస్టు, 26 జనవరి, తదితర రోజుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. మహబూబాబాద్ జిల్లా గార్లలో మాత్రం దసరా రోజున నెలవంకను పోలిన జెండాను ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. గార్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న క్రమంలో ఆ వీధిని జెండా బజారుగా పిలుస్తున్నారు. పండగ రోజు పంచాయతీ నుంచి ఊరేగింపుగా జెండాను తీసుకెళ్లి మసీదు సెంటర్‌లో ఎగురవేస్తారు. అనంతరం తూర్పాంజనేయ స్వామి ఆలయంలో శమీ పూజ చేస్తారు.

సరిహద్దు నుంచి సొంతూరుకు

వరంగల్ జిల్లా నర్సంపేటలో అన్ని ప్రాంతాల్లోలాగే వేడుకలు ఎంతో ఉత్సాహంగా చేస్తారు. హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డవారే కాదు సరిహద్దులో ఉన్న సైనికులు తప్పకుండా వస్తారు.. నర్సంపేటకు చెందినవారు సుమారు 30 మందికిపైగా సైన్యంలో సేవలందిస్తున్నారు.

వందేళ్ల నాటి జమ్మిచెట్టు



పాండవులు అరణ్య వాసం సమయంలో జమ్మిచెట్టుపై ఆయుధాలు పెట్టారని, ఆ తర్వాత చెట్టుమీద నుంచి తీసి యుద్ధానికి వెళ్తే విజయం కలిగిందని పురాణ ప్రతీతి. అందుకే ప్రతి ఊళ్లో దసరా రోజు గ్రామస్థులంతా జమ్మి చెట్టుకు పూజ చేయడం ఆనవాయితీ. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో సుమారు వందేళ్ల జమ్మి వృక్షం ఉంది. పండగ రోజు సాయంత్రం ఊరివారంతా డప్పువాయిద్యాల మధ్య 'పెద్ద గంప'లో సొరకాయ, సజ్జ, జొన్న మొక్కలను పట్టుకుని దసరా బండ వద్దకు చేరుకుంటారు. అక్కడ కొత్తగా నిర్మించిన పాకలో సొరకాయకు పూజ చేస్తారు. అనంతరం జంతుబలికి బదులు సొరకాయను కోస్తారు. తర్వాత జమ్మి చెట్టు వద్దకు వెళ్లి కంకణాలు కట్టుకొని పూజలు చేస్తారు.



భారీ రావణ వధ



వరంగల్ ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో దసరా వేడుకలు కోలాహలంగా జరుగుతాయి. లక్షకుపైగా జనం హాజరై వేడుకల్ని తిలకిస్తారు. 65 అడుగుల రావణాసురుడి బొమ్మ తయారుచేస్తారు. అనంతరం బాణసంచాతో పేల్చేస్తారు. దసరా నాడు స్థానిక ఆర్య సమాజ్ నుంచి ఎడ్లబండిపై సీతారాముల వేషధారణలో కళాకారులను తీసుకొస్తారు. ముందు రంగస్థల కళాకారులు చిరుతల భజన చేస్తూ ఊరేగింపుగా తరలివస్తారు. వీరికి ఉత్సవ కమిటీ స్వాగతం పలుకుతుంది. అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాక చివరకు రావణవధ ఉంటుంది. ఇదెంతో కనువిందు కలిగించే ఘట్టం. కర్ణాటకలోని మైసూరు తర్వాత అంత కోలాహలంగా వేడుకలు జరిగేది ఇక్కడే అని స్థానికులు చెబుతారు.

అయిదో రోజు అద్భుతంగా



బతుకమ్మ పండగ అంటే సాధారణంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, చివరి రోజు సద్దుల బతుకమ్మను ఊరువాడా సందడిగా చేస్తారు. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో అయిదో రోజు కూడా బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. భారీ పరిమాణంలో బతుకమ్మలను పూలతో పేర్చి మహిళలు బతుకమ్మలు ఆడి అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు.

పక్కాగా కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే


గణపురం : బుర్రకాయలగూడెంలో సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒకే రాష్ట్రం.. ఒకే కార్డు నినాదంతో రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తోంది. కుటుంబానికి ఒక కార్డును కేటాయించడంతో సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అందులో భాగంగా కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి రంగం సిద్ధమైంది. ఇంటింటా సమాచారం సేకరించి నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక ఇంట్లో ఎంత మంది సభ్యులు ఉన్నారు. వారి వయసు తదితర వివరాలను సేకరించనున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఓ మున్సిపల్ వార్డు, ఓ గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సర్వే చేపట్టారు.

● ఈ సర్వేను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టు క్రింద ప్రతి నియోజకవర్గంలో ఓ గ్రామం, మున్సిపాలిటీలో ఓ వార్డును ఎంపిక చేసి కుటుంబాల వివరాలను సేకరించనున్నారు. జిల్లాలోని భూపాలపల్లి నియోజకవర్గానికి ఆరు మండలాలు ఉండగా మంథని నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో ఐదు మండలాలు ఉన్నాయి. మంథని నియోజకవర్గంలోని నిర్వహించే సర్వేలో జిల్లాలోని గ్రామాలు లేకపోవడం గమనార్హం. అలాగే భూపాలపల్లి నియోజకవర్గాన్ని పరిశీలిస్తే గణపురం మండలం బుర్రకాయలగూడెం, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో సర్వే నిర్వహిస్తున్నారు.

నాలుగు బృందాలతో...

సర్వేకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. గణపురం మండలం బుర్రకాయలగూడెంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒక బృందం, ఎంపీడీవో ఆధ్వర్యంలో ఓ బృందం సర్వే నిర్వహిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో భూపాలపల్లి తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒక బృందం, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఓ బృందం ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారులతో పాటు 18 మంది రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించనున్నారు.

మున్సిపల్ వార్డులో..

గణపురం మండలం బుర్రకాయలగూడెంలో 161 కుటుంబాలకు 718 జనాభా ఉన్నట్లు అధికారులు తెలిపారు. భూపాలపల్లి 22వ మున్సిపల్ వార్డులో జనాభా వివరాలు సర్వే అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. సర్వే ప్రాంతంలో ఎన్ని కుటుంబాలు.. ఎంత జనాభా ఉందనే సమాచారం పక్కాగా ఉండాలి.. కానీ అందుకు విరుద్ధంగా అధికారులలో సమన్వయం లేక వివరాలు అందుబాటులో లేకుండానే సర్వే చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ అధికారిని 'న్యూస్‌టుడే' వివరణ అడగడంతో సర్వే చేస్తేనే కదా వార్డులో కుటుంబాల సంఖ్య, తదితర విషయాలు తెలుస్తాయని చెప్పడంతో వారి నిర్లక్ష్యం ప్రత్యేకంగా కనిపిస్తోంది.

ఇంటింటా సేకరణ..

ఇంటింటా కుటుంబ సభ్యులు, ఆధార్ కార్డు వివరాలను నమోదు చేసుకుంటారు. విద్యావంతుల విద్యార్హత ధ్రువపత్రాలు, నిరక్షరాస్యులైతే ఆధార్ కార్డుతో వయసు అంచనా వేయనున్నారు. కొత్తగా వివాహమైన వారిని నూతన కుటుంబ సభ్యులుగా, ఇంట్లో కూతురు పెళ్లి జరిగితే వారి వివరాలను, గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే వారి వివరాలను తొలగించనున్నారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు అందించనున్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టు ప్రాంగణంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వేడుకలలో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సంతోషంగా ఆటపాటలతో గడిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు బతుకమ్మ వేడుకలను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జిలు జయరాంరెడ్డి, కోర్టు ఏఈ అనిత, పీపీ శ్రీనివాస్‌రావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్, న్యాయవాదులు శ్రీనివాసచారి, వేశాల రవీందర్, రత్నం కిరణ్, అనిల్, ప్రియాంక, ఎస్.రవీందర్, సుధారాణి, కవిత, రావుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరానికి రూ.45.39 కోట్లు విడుదల


చిన్న కాళేశ్వరం పంపుహౌస్

కాళేశ్వరం, న్యూస్‌టుడే : మహదేవపూర్ మండలంలోని బీరాసాగర్ గోదావరి తీర ప్రాంతంలో నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.45.39 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ.31.39 కోట్లు బీరాసాగర్ వద్ద నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రానికి కేటాయించగా.. రూ.14 కోట్లు పెండింగ్‌లో ఉన్న భూసేకరణకు వ్యయం చేయనున్నట్లు ఈఈ యాదగిరి తెలిపారు. మంథని నియోజకవర్గంలోని కాటారం, మహదేవపూర్, మల్హర్, మహాముత్తారం మండలాలకు 45 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు 2008లో ఉమ్మడి రాష్ట్రంలో ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. మొదటగా రూ.499 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభం అయ్యాయి. తర్వాత వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. 2017లో తెలంగాణ ప్రభుత్వంలో తిరిగి పనులు పట్టాలెక్కినా పూర్తికాలేదు. నూతన ప్రభుత్వం వచ్చాక మంత్రి శ్రీధర్‌బాబు చిన్న కాళేశ్వరంపై దృష్టి సారించారు. అధికారులతో సమీక్షించి పనులు వేగవంతం అయ్యేలా కృషి చేస్తున్నారు. పథకం అంచనా వ్యయం రూ.954 కోట్లకు పెరిగింది. నిధుల కేటాయింపుతో భూసేకరణ వేగవంతం కానుంది.

జెన్‌కో ఆధ్వర్యంలో పవర్‌ప్లాంట్ నిర్మించాలి

చెల్పూర్, న్యూస్‌టుడే : రామగుండంలో నిర్మించే 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని జెన్‌కో ద్వారా నిర్మించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) ఆధ్వర్యంలో శనివారం కేటీపీపీ ప్రధాన ద్వారం వద్ద మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో నిర్మించనున్న నూతన విద్యుదుత్పత్తి కేంద్రాన్ని సింగరేణి, జెన్‌కో సంస్థలు సంయుక్తంగా నిర్మించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకునేది లేదని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



కేటీపీపీ ఎదుట నిరసన చేపట్టిన ఉద్యోగులు

పైపైకి పాతాళ గంగ.. తీరింది బెంగ


నిండుకుండలా గణపసముద్రం చెరువు

జిల్లా వ్యాప్తంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు (నాలుగు నెలల కాలంలో) వర్షాలు విస్తారంగా కురవడంతో చెరువులు, కుంటలు, బావులలో జలకళ సంతరించుకుంది. అనుకున్న దానికంటే 13 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. – భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే:


జిల్లాలో నమోదైన వర్షపాతం (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు)



ఈ ఏడాది జూన్‌లో తొలకరి చినుకులు జిల్లాను పలకరించాయి. జులై చివరి వారం, ఆగస్టు మొదటి వారంలో వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతకు ఇబ్బందులు తప్పలేదు. ఆగస్టు రెండో వారం నుంచి మళ్లీ దంచి కొట్టడంతో జిల్లాలో సాధారణ వర్షపాతం 942.8 మి. మీటర్లు ఉండగా అత్యధికంగా 1129.6 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో సాధారణం కంటే 13 శాతం అధికంగా కురిసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

మూడు మండలాల్లో అత్యధికంగా...

మూడు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మహాముత్తారం మండలంలో సాధారణం 1002.9 మి.మీ ఉండగా, 1219.8 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో అక్కడ సాధారణం కంటే 20 శాతం అధికంగా పడింది. రేగొండ మండలంలో 917.5 మి.మీ సాధారణానికి, 1122.2 మి.మీ కురవడంతో 18 శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాటారం మండలంలో సైతం 9 శాతం అధికంగా కురిసినట్లు అధికారులు తెలిపారు. దీంతో వానాకాలం, యాసంగి సాగులో నీటి కొరత ఉండదని అధికారుల మాట. యాసంగిలో తక్కువ నీటితో సాగు చేసే పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు.



భూగర్భ జలాలు పైపైకి..

జిల్లాలో గతేడాదితో పోలిస్తే భూగర్భ జలాలు పెరిగాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 6.05 మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం జిల్లాలో 5.09 మీటర్ల లోతులో ఉన్నాయి. ఈ లెక్కన పోలిస్తే జలాలు మీటరు పైకి వచ్చాయి. అత్యధింగా చిట్యాల మండలంలో 1.91 మీటర్లు, మహాముత్తారం మండలం 1.94 మీటర్ల లోతులో ఉన్నాయి. అత్యల్పంగా కాటారం మండలం 15.65 మీటర్లు, మహదేవపూర్ మండలంలో 10.26 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. ఈసారి కాటారం మండలంలో సాధారణం కంటే అధిక వర్షాలు పడిన భూగర్భ జలాలు పెరగకపోవడం గమనార్హం.

ముగిసిన ధ్రువ పత్రాల పరిశీలన

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ-2024 ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. జిల్లాలో వివిధ కేటగిరికి చెందిన అభ్యర్థులను 1:3 ప్రకారం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మొత్తం 581 మంది అభ్యర్థులకు చివరి రోజు వరకు 548 మంది హాజరైనట్లు డీఈవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 33 మంది అభ్యర్థులు హాజరు కాలేదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గత నాలుగు రోజులుగా ధ్రువ పత్రాల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులకు, ఈ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులకు, డీఈవో కార్యాలయం అధికారులకు, సిబ్బందికి డీఈవో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శప్రాయుడు వెంకటస్వామి


వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వెంకటస్వామి ప్రజాసేవకు అంకితమై తన రాజకీయ జీవితంలో ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెంకటస్వామి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆయన ఆశయాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, వివిధ శాఖల మంత్రిగా పనిచేసి ప్రజలకు విశేష సేవలు అందించారని తెలిపారు. ఆయన త్యాగం, అంకితభావం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి సంజీవరావు, సంక్షేమాధికారి చిన్నయ్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, కలెక్టరేట్ ఏవో ఖాజా మోహియోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


ఈ విద్యాలయం.. సైనికుల కర్మాగారం!

ఖానాపురం(నర్సంపేట), న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమి దేశరక్షణకు మెరికల్లాంటి సైనికులను అందిస్తోంది. ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు సరిహద్దుల్లో సైనికులుగా పనిచేస్తూ దేశ రక్షణలో పాలు పంచుకుంటున్నారు. ఈ విద్యాలయంలో చేరిన నిరుపేద గిరిజన విద్యార్థులకు విద్య, వసతితో పాటు వ్యాయామం, దేహదారుఢ్యం తదితర అంశాల్లో పటిష్ఠ తర్ఫీదు ఇస్తున్నారు. పలు అంశాలను ఆకళింపు చేసుకుంటున్న విద్యార్థులు.. ప్రభుత్వం నిర్వహించే శారీరక, రాత పరీక్షలను సులువుగా అధిగమించి భారత సైన్యం, అగ్నివీర్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, నేవీ, పోలీసు తదితర విభాగాల్లో ఎంపికై సేవలందిస్తున్నారు. 1984లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాల అంచెలంచెలుగా ఉన్నతీకరణ చెంది సైనిక్‌స్కూల్‌గా మారింది. 2022, 2023 విద్యా సంవత్సరాల్లో త్రివిధ రక్షణ దళాలు, భద్రత, తదితర విభాగాల్లో 22 మంది సేవలందిస్తున్నారు. అగ్నివీర్‌కు నలుగురు, జీడీఎస్ పోస్టల్‌కు ముగ్గురు, ఫైర్‌మెన్ ఏవోసీకి ఒకరు, సీఆర్పీఎఫ్‌కు ఒకరు, బీఎస్ఎఫ్‌కు ఒకరు, భారత సైన్యానికి ఐదుగురు, నావికా దళానికి ఇద్దరు, టీఎస్ పోలీస్ కానిస్టేబుళ్లుగా ఐదుగురు ఎంపికయ్యారు.



సైనిక్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

డిగ్రీ ద్వితీయ ఏడాదిలోనే ఎంపికయ్యా..



సైనిక్‌స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆర్మీకి ఎంపికయ్యాను. ఇక్కడి అధ్యాపకులు ఇచ్చిన తర్ఫీదు వల్లే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో పని చేస్తున్నా. దేశ రక్షకుడిగా పని చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు. **-రాము**

అధ్యాపకుల శిక్షణ తోడ్పడింది



ఇంటర్‌లో పాఠశాలలో చేరాను. భారత సైన్యానికి ఎంపికయ్యేందుకు. అధ్యాపకులు, ఇన్‌స్ట్రక్టర్లు అందించిన శిక్షణ తోడ్పడింది. తక్కువ సమయంలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. **-జవిందర్**

గురుకులంలో చదవడం అదృష్టం



డిఫెన్స్‌లో ఫైర్‌మెన్ ఏవోసీకి ఎంపికయ్యాను. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా ఉద్యోగం వచ్చింది. గురుకులంలో చదవడం నా అదృష్టం. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటా. **-సింహాద్రి**

ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా



డిగ్రీ చదువుతుండగానే ఉద్యోగం వచ్చింది. నేవీలో శిక్షణ పూర్తయింది. పాఠశాల ఉపాధ్యాయుల సూచనలు పాటించి పట్టుదలతో చదివి ఈవెంట్లు చేశాను. ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా. **-భరత్**

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ - సురేందర్, ప్రిన్సిపల్, సైనిక్‌స్కూల్, అశోక్‌నగర్

క్రమశిక్షణతో చదివితే ఉద్యోగాలు సాధించడం సులువని సైనిక్‌స్కూల్ విద్యార్థులు నిరూపించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. అందరి కృషితోనే ఇది సాధ్యమైంది.

ఉపాధి కోసం వెళ్లి.. తూటాకు బలై!

● ఉగాండాలో జనగామ సివిల్ ఇంజినీర్ హత్య



తిరుమలేష్ (పాత చిత్రం)



స్వగృహంలో రోదిస్తున్న తల్లి కిష్టమ్మ, బంధువులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే : ఉన్నత విద్య అభ్యసించారు.. ఉపాధి మార్గం వెతుక్కుంటూ విదేశానికి వెళ్లారు.. జీవితం అంతా సాఫీగా సాగుతుందనుకున్న సమయంలో తుపాకీ తూటా రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఈ ఘటన జనగామ పట్టణంలో విషాదం నింపింది. జనగామ పట్టణం తొమ్మిదో వార్డు గిర్నిగడ్డకు చెందిన ఇటికాల తిరుమలేష్(42) సివిల్ ఇంజినీర్ పూర్తి చేశారు. కొంతకాలం కరీంనగర్‌లో ఉద్యోగం చేసిన అనంతరం ఉగాండా దేశంలోని రాయల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అవకాశం రావడంతో పదేళ్ల క్రితం అక్కడికి వెళ్లారు.. ప్రాజెక్టు మేనేజర్ హోదాలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉగాండాలోని నమ్మశాల ప్రాంతంలోని కంపెనీలో శుక్రవారం తిరుమలేష్ విధుల్లో ఉండగా శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలు) అదే కంపెనీకి చెందిన సెక్యూరిటీ గార్డు తాగిన మైకంలో ఒక్కసారిగా తుపాకీతో గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. భారీ శబ్దం విని బయటకు వచ్చిన తిరుమలేష్‌పైనా విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు కూడా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనతో భయకంపితులైన కంపెనీలోని ఇతర ఉద్యోగులు బయటకు రాలేదు. తిరుమలేష్ మృతిచెందిన విషయాన్ని కంపెనీ ప్రతినిధులు జనగామలో ఉంటున్న తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నాకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులంతా ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. తిరుమలేష్‌కు భార్య సునీత, కుమార్తె అఖిల, కుమారుడు వరుణ్ ఉన్నారు. కుమార్తె అఖిల నిజామాబాద్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద 8వ తరగతి చదువుతోంది. కుమారుడు వరుణ్ ఉగాండాలోనే తల్లిదండ్రులతో ఉంటూ పదోతరగతి చదువుతున్నాడు. తిరుమలేష్ తండ్రి కిష్టయ్య కరోనాతో నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మృతుడి తల్లి కిష్టమ్మతో పాటు మరో సోదరుడు చిన్నా, సోదరి హేమలత జనగామలోనే ఉంటున్నారు. తిరుమలేష్ మృతి వార్త తెలియగానే ఆయన ఇంటికి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీళ్లు పెట్టుకున్నారు.

అంతా సివిల్ ఇంజినీర్లే

మృతిచెందిన తిరుమలేష్ సివిల్ ఇంజినీర్ కాగా, అతని సోదరుడు చిన్నా కూడా సివిల్ ఇంజినీర్‌గా సిద్దిపేటలో పనిచేస్తున్నారు. తండ్రి కిష్టయ్య సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోనే పనిచేసేవారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థానాలకు చేర్చిన తండ్రి కిష్టయ్య కరోనాతో దూరంగా కాగా, ఇప్పుడు ఇంటి పెద్ద కొడుకు తిరుమలేష్ కూడా చనిపోవడంతో తల్లి కిష్టమ్మతో పాటు కుటుంబమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. తిరుమలేష్ మృతదేహన్ని మంగళవారం వరకు జనగామకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సోదరుడు చిన్నా తెలిపాడు. ఉగాండాలోని ఎంబసీ అధికారులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా సమాచారం చేరవేసి మృతదేహం రప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు కార్యక్రమం



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో ఆదివారం (అక్టోబర్ 6వ తేదీ) ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

అండర్-19 క్రికెట్ పోటీల విజేత కరీంనగర్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో మహబూబ్‌నగర్ జట్టుపై కరీంనగర్ 2 వికెట్లతో తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఓరుగల్లు జిల్లా కేంద్రంగా నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. శనివారం వరంగల్ నగర శివారులో ఉన్న మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్ల మధ్య తుదిపోరు జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. జట్టులో షాదాబ్ 89, అబ్దుల్ 48 పరుగులతో రాణించారు. కరీంనగర్ బౌలర్లు విఘ్నేష్, అర్షద్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విఘ్నేష్ 53 పరుగులు, కమ్రాన్ 50 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. అనంతరం జరిగిన ముగింపు వేడుకలో అతిథులు విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అండర్-19 టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రికెటర్లను హెచ్‌సీఏ జట్టుకు ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పెద్ది ప్రవీణ్‌గౌడ్, బస్వరాజు శ్రీమాన్, ఉదయభానురావు, వెంకటేశ్వర్లు, రఘురాం, ఉపేందర్, రాము, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కరీంనగర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

'అలుగు' అక్రమ రవాణా కేసులో స్మగ్లర్ల అరెస్టు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి అటవీ రేంజి పరిధిలోని మేడిపెల్లి టోల్‌గేట్ ప్రాంతంలో అలుగు (పొంగలిన్) రవాణాకు పాల్పడిన కేసులో శనివారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు భూపాలపల్లి అటవీ అధికారులు తెలిపారు. ఇదే కేసులో చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, ఇంటెలిజెన్స్ అధికారులు చాకచక్యంగా కొనుగోలుదారుల రూపంలో తాటి రాజ్‌కుమార్, ఎండీ. నజీర్, ఎండీ. అమ్జద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని హనుమకొండకు తరలించిన విషయం తెలిసిందే. వీరిని విచారించగా మరో ఐదుగురి ప్రమేయం ఉందని నిందితులు చెప్పినట్లు స్థానిక రేంజి అధికారి నరేష్ అరెస్టు వివరాలను వెల్లడించారు. గట్టు సమ్మయ్య, తాళ్లపల్లి శంకర్, ఊరుగొండ దేవన్న, పెద్ది లక్ష్మయ్య, నరివెద్ది వెంకటనారాయణ కోసం గాలించగా గట్టు సమ్మయ్య, నరివెద్ది వెంకటనారాయణను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారని, మొత్తం 8 మందిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో కాటారం మండలం కొత్తపల్లి, ములుగుపల్లి, ఇబ్రహీంపల్లికి చెందిన తాటి రాజ్‌కుమార్, గట్టు సమ్మయ్య, ఎండీ. అమ్జద్‌ఖాన్, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన ఎండీ. నజీర్, భూపాలపల్లికి చెందిన నరివెద్ది వెంకటనారాయణ ఉన్నారు. వీరి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు రేంజి అధికారి నరేష్ తెలిపారు. కాటారం అటవీ రేంజి అధికారి హసీబ్ అలీ, సెక్షన్ అధికారి సంతోష్, బీట్ ఆఫీసర్లు ప్రశాంత్, భాస్కర్ పాల్గొన్నారు.



అరెస్టు చూపుతున్న భూపాలపల్లి అటవీ అధికారులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కుస్తీ పోటీల్లో ఓరుగల్లుకు కాంస్యం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్‌ఐ) కుస్తీ(రెజ్లింగ్) పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. నారాయణపేట జిల్లా ధన్వాడలో శనివారం జరిగిన కుస్తీ పోటీల్లో అండర్-19 బాలికల జట్టు పతకాలతో రాణించింది. బి.అంజలి 55 కిలోల విభాగంలో స్వర్ణం కైవసం చేసుకుంది. 69 కిలోల విభాగంలో సౌమ్య, 76 కిలోల విభాగంలో ఎన్.అంజలి రజత పతకాలు, 59 కిలోల విభాగంలో కావేరి, 72 కిలోల మైత్రేయి కాంస్య పతకాలు సాధించారు. స్వర్ణం నెగ్గిన బి.అంజలి దిల్లీలో జరిగే ఎస్‌జీఎఫ్‌ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు హనుమకొండ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, హనుమకొండ కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన రెజ్లర్లను హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గోపాల్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి కరీం అభినందించారు.



తృతీయ స్థానంలో నిలిచిన జట్టుతో అతిథులు

రహదారి వెంట మురుగు పారే..



మండలంలోని తిరుమలాపూర్‌లోని ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు నీరు పారుతోంది. సైడ్ కాలువలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా మురుగు, వర్షపు నీరు వెళ్లేందుకు కాలువలు తీయించారు. అవే శాశ్వతంగా మారిపోయాయి. రోడ్డు పక్కన మురుగునీరు పారుతూ ఇంటి ముందు బురద చేరి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, చిట్యాల(భూపాలపల్లి జిల్లా)

బతుకమ్మ సంబరాలు



చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, సువిద్య డిగ్రీ కళాశాలల్లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడుతూ, పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి, కరస్పాండెంట్ రాజు విద్యార్థులకు బతుకమ్మ పండగ చరిత్ర, తెలంగాణ సంస్కృతిని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి యుగంధర్, వేణు, లోకేందర్, ప్రీతమ్‌కుమార్, మమత, శ్రీలత, రజిత, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, చిట్యాల

దండకారణ్యంలో నిశ్శబ్ద యుద్ధం..!



దండకారణ్యంలో యుద్ధతంత్రాలు మోగుతున్నాయి. పోలీసులు, మావోయిస్టుల మధ్య నిశ్శబ్దయుద్ధంతో సరిహద్దు అడవులు చిగురుటాకులా వణుకుతున్నాయి. ఇటు తెలంగాణ, అటు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతుండటం కలవరానికి గురి చేస్తున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్-దంతెవాడ జిల్లా సరిహద్దుల్లో నెందూర్-తుల్‌తులి అడవుల్లో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 31 మంది మావోయిస్టులు మృతి చెందటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉలికిపాటుకు గురైంది. – వెంకటాపురం(ములుగు జిల్లా), న్యూస్‌టుడే

కవ్వింపా.. తెగింపా..

సరిహద్దు తెలంగాణాలో మావోయిస్టులు కవ్వింపు చర్యలకు దిగినట్లు ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. గత నెలలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా కరకగూడెం, గుండాల అడవుల్లో జరిగిన ఎదురు కాల్పులు, అరెస్టులతో రాష్ట్రానికి చెందిన బీకే-ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. అయినప్పటికీ.. తెగింపు ధోరణిలో గత నెల 25 తేదీన చర్ల మండలం పూసుగుప్ప అడవుల్లోని సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపుపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటం కలకలం రేపింది. ఈ క్యాంపుపైకి బీజీఎస్(బ్యారెల్ గ్రేనేడ్ లాంచర్)లను వినియోగించినట్లు పోలీసుల నిర్ధారణలో తేలింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

చక్రబంధంలో సరిహద్దు

మావోయిస్టుల కదలికలు, ఛత్తీస్‌గఢ్ ఘటనతో పోలీసులు సరిహద్దును చక్రబంధంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పర్యవేక్షణలో ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలో నిఘాను కట్టుదిట్టం చేశారు. ప్రధానంగా వెంకటాపురం పోలీస్ సర్కిల్ పరిధిలో మావోయిస్టుల కదలికలు ఉండే ప్రాంతాలపై డేగకన్ను వేసేలా దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. అటవీ ప్రాంతాల ప్రజలను చైతన్యం చేయడంతో పాటు ఎలాంటి ఉపద్రవం ముంచుకొచ్చినా.. తిప్పికొట్టేలా సంసిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఛత్తీస్‌గఢ్ ఘటనతో కలవరం



నెందూర్-తుల్‌తులి అటవీ ప్రాంతం నుంచి మృతదేహాలను తరలిస్తున్న ప్రత్యేక బలగాలు



ఎందుకొచ్చారు.. ఎవరొచ్చారు..

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ మాసోత్సవాలను సెప్టెంబరు 20వ తేదీ నుంచి అక్టోబరు 21 వరకు నిర్వహిస్తోంది. ఈ ప్రాంతంలోనూ నిర్బంధాలు, ఎదురుకాల్పులతో పోలీసులదే పైచేయి కాగా, ఆరు రోజుల కిందట వాజేడు మండలంలోని ఓ గిరిజన గ్రామ సమీప అడవుల్లో మావోయిస్టులు సమావేశం నిర్వహించడం పోలీసులకు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీకి చెందిన కార్యదర్శి అనిత, డిప్యూటీ సెక్రటరీ మహేందర్‌తో పాటు మరో నలుగురు సాయుధులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు విశ్వసనీయ సమాచారం. కొన్నేళ్లుగా ఇంతటి కవ్వింపు చర్యలకు దిగని నక్సల్స్ ఏకంగా సమావేశంలో పాల్గొనడం వెనుక వ్యూహం ఏమిటనేది నిఘా వర్గాలు కూపీలాగే పనిలో ఉన్నాయి.

శిఖం భూములను రక్షించాలని డిమాండ్



మాట్లాడుతున్న మారేపెల్లి మల్లేష్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని మండలాల్లో కబ్జాకు గురైన చెరువు శిఖం భూములను రక్షించాలని, అదే విధంగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న హైడ్రా విధానం జిల్లాలో అమలు చేసి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం చంద్రగిరి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. చెరువు శిఖం భూములోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు వేసుకున్న గుడిసె వాసులకు ప్రభుత్వం పక్కా గృహాలను నిర్మించాలని కోరారు. సమావేశంలో నాయకులు నరేష్, సుమన్, రాకేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల ఒడిశాలో ఎంసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ కోల్ ఇండియా స్థాయి పోటీల్లో భూపాలపల్లి డివిజన్‌కు చెందిన కేటీకే 5వ గనిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు రజత, కాంస్య పతకాలు సాధించిన శ్రీలేఖ్య, అనూషలను శనివారం ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా సత్కరించారు. పవర్ లిఫ్టింగ్‌లో 52 కిలోల విభాగంలో శ్రీలేఖ్య రజత పతకం, 76 కిలోల విభాగంలో అనూష కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కోల్ ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తిరుపతి, ఎండి. ఆసిఫ్‌భాషా, కార్మికులు రామన్న, ప్రకాష్, కుమారస్వామి, రాజేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో సర్వే



నవాబుపేటలో..

చిట్యాల, న్యూస్‌టుడే: జిల్లా వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నవాబుపేట రేషన్ దుకాణంలో బియ్యం నాణ్యత, పంపిణీ విధానంపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మేడిపల్లి సావిత్రి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అర్హులైన వినియోగదారులకు సూక్ష్మ పోషకాలు (ఫోర్టిఫైడ్) ఉన్న బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉందన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం నాణ్యమైన సంచుల్లో బియ్యం ప్యాకింగ్ చేయాలన్నారు. నాసిరకం సంచుల్లో బియ్యం సరఫరా చేస్తున్నారని దీంతో వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. దుకాణాల్లో పౌర సరఫరాల అధికారులు సంతకం చేసిన సాంపిల్స్ ప్రదర్శించడం లేదని పేర్కొన్నారు.

పొదుపు సంఘాలకు రుణాలిప్పించాలని ఆదేశం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో అర్హులైన మహిళా పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించేందుకు మెప్మా అధికారులు కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో మెప్మా సిబ్బంది, ఆర్‌పీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మహిళా శక్తికి సంబంధించిన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను లక్ష్యం మేరకు సభ్యులకు అందించే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా కొత్తగా పొదుపు సంఘాలను ఏర్పాటు చేస్తూ, వారి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, అధికారులు రాజేశ్వరి, శ్యాంబాబు, సీవో నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి'

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న భాజపా మతోన్మాద విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు కోరారు. జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్ కాలనీలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం మండల నాలుగో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చి నాటి నుంచి దళితులు, ఆదివాసీలు, కార్మికులపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో నిరుపేద కూలీల కోసం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు, దళితులకు పోడు భూములకు హక్కు పత్రాలు అందజేసి సాగుకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పేదల సంక్షేమానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, మహేందర్, రవికుమార్, గోపాల్, రమ, శారద, వసుంధర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మహదేవపూర్, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దంపేట సబ్‌స్టేషన్ పరిధిలో పెద్దంపేట, అంబట్‌పల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. 33కేవీ విద్యుత్తు లైన్ మరమ్మతుల దృష్ట్యా అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని ఆయన సూచించారు.

ఏటీసీ నిర్మాణ పనుల అడ్డగింత



కాటారం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు గతంలో గంగారంలో కేటాయించిన భూమి వివాదంలో ఉండడంతో మండల కేంద్రంలోని తిమ్మనకుంటలో ఎకరం భూమి కేటాయించారు. సదరు స్థలాన్ని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ శనివారం పరిశీలించి త్వరితగతిన ఏటీసీ నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో కాంట్రాక్ట్ నిర్వాహకులు నిర్మాణ పనుల నిమిత్తం జేసీబీతో మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రయత్నించగా పలువురు అడ్డుకున్నారు. తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్‌లు చేరుకోగా తమకు ఇది వరకే ఇంటి స్థలాలు ఉన్నాయని పనులు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. సర్వే చేపట్టి తమ స్థలాలకు హద్దులు నిర్ణయించి పనులు చేయాలని పేర్కొన్నారు. రెండ్రోజుల్లో పూర్తిస్థాయి సర్వే చేపడతామని తహసీల్దార్ తెలుపడంతో నిర్వాహకులు మట్టి నమూనా సేకరించారు.

జెన్‌కో ఉద్యోగుల నిరసన



కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ అనుబంధమైన కన్నెపల్లి జెన్‌కో పంపుహౌస్ ఉద్యోగులు శనివారం పంపుహౌస్ గేటు వద్ద నిరసన తెలిపారు. రామగుండంలో జెన్‌కోకు సంబంధించిన 62.5యండబ్ల్యూ యూనిట్ స్థానంలో సింగరేణి భాగస్వామ్యంతో తలపెట్టిన డీపీఆర్‌ను రద్దు చేసి జెన్‌కో ఆధ్వర్యంలోనే 800 యండబ్ల్యూ నిర్మించాలన్నారు.

ప్రత్యేక అలంకరణలు.. విశేష పూజలు

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్ మండల కేంద్రంలో శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గర్భగౌరి సంస్థాన్ ఆధ్వర్యంలో అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. గంగదేవి ఆలయంలో, దుబ్బగూడెంలో గాయత్రి అలంకరణలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సామూహికంగా కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు కొమ్మెర శ్రీరాంమూర్తి శర్మ, గంగ దేవి ఆలయ అర్చకులు టి.నిశాంత్ పాల్గొన్నారు.



మహదేవపూర్ గంగ దేవి ఆలయంలో..



గణపురం మండల కేంద్రంలో..

కాటారం: మండలంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ధన్వాడలోని దత్తాత్రేయ ఆలయంలో దుర్గా దేవి వద్ద శనివారం చండీయాగం నిర్వహించారు. యాగంలో దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

గణపురం: గణపురం మండలకేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీసాంబమూర్తి దేవాలయంలో కొలువుదీరిన దుర్గమాత శనివారం అన్నపూర్ణ దేవి అలంకణలో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరామకృష్ణ భజనమండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీణవంక నవీన్, ప్రసాద్, అన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాటారం: చండీ యాగం..



మొగుళ్లపల్లిలో

ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని సింగరేణి రెస్క్యూ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి తను అన్ని విధాలుగా సహకరిస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. శనివారం ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పాల్గొని వేదపండితుల సమక్షంలో భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఫిబ్రవరిలో నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం రెస్క్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను రెస్క్యూ కార్యాలయం సిబ్బంది, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం కవీంద్ర, రవీందర్, కార్మిక సంఘాల నాయకులు రమేష్, బుచ్చయ్య పాల్గొన్నారు.

వెంకటస్వామికి ఘన నివాళి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత జి.వెంకటస్వామిని ఆదర్శంగా తీసుకొని కార్మికవర్గం ముందుకెళ్లాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. ఆయన జయంతి సందర్భంగా శనివారం స్థానిక సింగరేణి జీఎం కార్యాలయం ఆవరణలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మికులకు పెన్షన్ స్కీం తీసుకొచ్చిన గొప్ప నాయకుడు వెంకటస్వామి అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో జీఎం హబీబ్ హుస్సేన్, అధికార ప్రతినిధి మారితి, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మల్హర్ : మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి సందర్భంగా తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్, రవీందర్, నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



రేగొండ : కొడవటంచ గ్రామంలోని సుప్రసిద్ధ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. మధ్యాహ్నం సుదర్శన హోమం, కల్యాణ ఘట్టాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు, కానుకలు సమర్పించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, శ్రీనాథాచార్యులు, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు శ్రావణ్‌కుమార్, సుధాకర్, భిక్షపతి భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళా దొంగల అరెస్టు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: వెండి ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చి వెండి పట్టా గొలుసులను అపహరించుకొని పోయిన ముగ్గురు మహిళలను మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ బన్సీలాల్ శనివారం రాత్రి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా మొగుళపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చెందిన మాసు అన్నపూర్ణ, రాధ, శనిగరం పూలమ్మలు గతనెల 30న స్థానిక శ్రీ వైష్ణవి జువెల్లర్స్‌లో వెండి ఆభరణాలు కొనుగోలు చేస్తామంటూ వచ్చి 10 జతల వెండి పట్టా గొలుసులను దొంగిలించారు. అదేరోజు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు దుకాణంలో ఉన్న నిఘా నేత్రం ఆధారంగా నిందితులను గుర్తించారు. శనివారం ఎస్సై సనత్, సిబ్బంది బాబాజీ, సుబ్బారావులు ఇస్సిపేటకు వెళ్లి నిందితులను పట్టుకున్నారు. నిందితులు గతంలో బెల్లంపల్లి, జమ్మికుంట, వరంగల్‌జిల్లాలోని మట్టెవాడలోని బంగారు దుకాణాల్లో చోరికి పాల్పడినట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

కొత్తపల్లిగోరి, (రేగొండ), న్యూస్‌టుడే: చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన కొత్తపల్లిగోరి మండలం సుల్తాన్‌పురంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన వేముల సాయిలు(70) సమీప బంధువు శుక్రవారం మృతి చెందగా గ్రామం పక్కనే ఉన్న చెరువు వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు చెరువులో దిగి స్నానం చేస్తుండగా సాయిలు చెరువులో దిగాడు. చెరువు లోతు తెలియక నీటిలో మునిగి మృత్యువాతపడ్డాడు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.సందీప్‌కుమార్ తెలిపారు.

గంజాయి పట్టివేత



నిందితులను చూపుతున్న అధికారులు

మహాముత్తారం, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న యువకులను మహాముత్తారం పోలీసులు శనివారం పట్టుకున్నారు. స్థానిక ఎస్సై మహేందర్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని యామన్‌పల్లి వద్ద ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన పంగ అంజి అలియాస్ సిద్దు, భూపాలపల్లికి చెందిన కండెల భవాని ప్రసాద్‌లు గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. 820 గ్రా. ఎండు గంజాయి, రెండు ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ రాజయ్యగౌడ్, కానిస్టేబుళ్లు సత్యం, మాషుక్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు

గణపురం, న్యూస్‌టుడే: గణపురం మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు గణపురం అంగడి ప్రాంతంతో పాటు రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో స్థలం చదును చేసి, అవసరమైన చోట మట్టితో గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం నీటి పారుదలశాఖ డీఈ బసవప్రసాద్, ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి విజేందర్ ఏర్పాట్లను పరిశీలించారు.

పునరావాసం కల్పించాలని వినతి

మల్హర్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడిచెర్ల ఉపరితల గని భూనిర్వాసితులు శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతి పత్రం అందజేశారు. పెద్దతాడిచెర్ల డేంజర్‌లోని ఇళ్లకు పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని కోరారు. బొగ్గు తవ్వకాల ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన జెన్‌కో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం బాంబు పేలుళ్ల ధ్వనితో ఇళ్లు కూలిపోతున్నాయని వివరించారు. మిగులు భూములు సేకరించాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేసినా సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావుల కల్పన, నిర్వాసితులు బూడిది మల్లేశ్, ఆర్ని సత్యనారాయణ, గట్టయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మల్హర్, న్యూస్‌టుడే: రుద్రారంలో నివాసం ఉంటున్న ఓ మహిళ ఇంటిని కూల్చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. బాధితురాలిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, సోషలిస్టు పార్టీ ఇన్‌ఛార్జి భిక్షపతి, లచ్చయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

భూపాలపల్లి రూరల్: ఇటీవల వరదలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని నిరాశ్రయులైన అక్కడి ఫొటోగ్రాఫర్లకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎండీ రఫీ మాట్లాడుతూ... ఆపదలో ఉన్నవారిని ఆదుకుని వారిలో మనోధైర్యం నింపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సాగర్, సదానందం, శేక్ మదార్, గులాం పాషా, రాజేశ్, మదునయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

చిట్యాల: మండలంలోని తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శనివారం కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో కొంత లోటు ఏర్పడిందని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కొత్తపల్లి రాము సాయంతో దుస్తులు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల యూత్ ప్రధాన కార్యదర్శి గోపగాని శివకృష్ణ, గోల్కొండ మహేశ్, ఎలగొండ చిరంజీవి పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చిట్యాల మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బంధు సాయిలు తెలిపారు. మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో నిర్వహిస్తున్న సీపీఎం మండల మహాసభల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. మండల కార్యదర్శిగా చింతల రజినీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్‌గా భూక్యా నవీన్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకారం అందించిన జిల్లా కమిటీ, మండల కార్యకర్తలకు రజినీకాంత్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రామచంద్రు, కుమారస్వామి, సమ్మన్న, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.